# సత్యవాక్కు

సంపుటి - 40 | జూలై - 2019 | సంచిక -12

## THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2019**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# LADS to LEADERS

## బాలకుల నుండి పాలకులయ్యే వరకు

## ఇండియా కన్వెన్షన్

## INDIA CONVENTION

సమయం : 2019 ఆగష్టు 9, 10 తేదీలలో

స్థలము : సత్యవాణి, క్రీస్తు సంఘము, రామారావుపేట, కాకినాడ

క్రీస్తు సంఘములలో యున్న బాలబాలికలను, యువతీ యువకులను, భావితరములకు మంచి నాయకులుగా తీర్చిదిద్దుటకు ఈ కార్యక్రమము ఉద్దేశించబడినది. దేవుని వాక్యములో నైపుణ్యత గల బాలబాలికలకు మంచి బహుమతులు ఇయ్యబడును. ఉచిత భోజన వసతి కల్పించబడును. మీ స్థానిక సంఘములోయున్న బాలబాలికలు, యువకులు హాజరయ్యేటట్లు చూడండి. వివరములకు దిగువ నుదహరించిన వారిని సంప్రదించండి.

బ్రదర్. లక్ష్మీగౌతం

సత్యవాణి, కాకినాడ

ఫోన్ : 0884 2363722

98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 40** **జూలై - 2019** **సంచిక -12**

## మీరు బిడ్డలవంటి వారైతేనే గాని...

### (Except Ye become as Little Children)

మత్తయి 18:1-3లో మనందరకు ఒక మంచి పాఠము దాచబడియున్నది. దానిని ఇప్పుడు మన పాఠ్యభాగముగా చదువుకొందము : "ఆ కాలమున శిష్యులు యేసునొద్దకు వచ్చి పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడని అడుగగా, ఆయన యొక చిన్న బిడ్డను తన యొద్దకు పిలిచి, వారి మధ్యను నిలువబెట్టి యిట్లనెను: "మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోకరాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

ఈ లోకములో బహు సంతోషముగా యెవరున్నారు అని మనమడిగితే చిన్నబిడ్డలు అని మనము జవాబియ్యవలసి వచ్చును. పెరిగి పెద్దవారమైన మనము చిన్నబిడ్డల వంటి మనస్తత్వము కలిగి యున్ననాడు నిజముగా దేవుని బిడ్డలమే అని చెప్పుకొనవచ్చును. కొందరు చిన్న బిడ్డల వలె సంతోషముగా తమ జీవితాన్ని గడుపవలెననుకొంటారు గాని, చిన్న బిడ్డల గుణములను మాత్రము అనుకరించలేరు. పరలోక రాజ్యములో ప్రవేశింపవలెనంటే చిన్న

బిడ్డలవంటివారము కావలెనని యేసు ప్రభువు చెప్పినందున, బిడ్డల యొక్క గుణ లక్షణము లేమిటో మనము తెలిసి కొనవలసి యున్నది.

బిడ్డలు సమస్తమును నమ్ము దురు. వారి నమ్మిక సూక్ష్మమైనది. బిడ్డలు యెవరినైనా లేక దేనినైనా నమ్మ వచ్చునని అనుకొందురు గనుక వారు నమ్ముదురు. క్రైస్తవుల నమ్మిక లేక విశ్వాసము కూడ సూక్ష్మమైనది. వారి యొక్క నమ్మిక యేసుక్రీస్తు దేవుని కుమారుడను దానిపై కేంద్రీకృతమై యున్నది (1 యోహాను 5:4,5). చిన్న బిడ్డల వలె మనమును సంశయము లేకుండా యేసుప్రభువునందు విశ్వాస ముంచవలెనని ఆయన కోరుచున్నారు. “మీ హృదయములను కలవరపడ నియ్యకుడి; దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నా యందును విశ్వాసముంచుడి” అని ఆయన చెప్పు చున్నారు (యోహాను 14:1). బిడ్డలు తమ జీవితములో పెద్దవారి యొక్క సహాయముపై కేవలము ఆధార పడి యుందురు. అట్లే మనము కూడ దేవుని పై ఎల్లప్పుడు ఆధారపడి యుండ వలెను. బిడ్డలు తమ హృదయము లో యున్న దానిని నిస్సందేహముగా యెట్లు ప్రకటించెదరో అట్లే ప్రభువు నందున్న మన విశ్వాసమును నిస్సందే హముగా ప్రకటించవలెనని ఆయన కోరుచున్నారు (మత్తయి 10:32,33).

బిడ్డల జీవితము ఎంతో నిరీక్షణ కలిగిన జీవితమై యున్నది. అట్లే క్రైస్తవుల జీవితము కూడ నిరీక్షణతో కూడినట్టిదై యుండవలెను. “ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము అనగా మహాదేవుడును మన రక్షకుడు నైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది” (తీతు 2:11-13).

దేనిని గూర్చి బిడ్డలు

చింతించరు. వారెవరిపై ఆధారపడి యున్నారో వారు తమ అవుసరములను సంపూర్తిగ తీర్చెదరని వారు నమ్ముదురు. అట్లే మనము కూడా దేవునిపై ఆధారపడి యుండవలెనని క్రీస్తు బోధించెను : "కాబట్టి ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీపరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. రేపటిని గూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును; ఏనాటి కీడు ఆనాటికి చాలును" (మత్తయి 6:31-33). బిడ్డలు తప్పుచేసినప్పుడు తలిదండ్రులు వారిని శిక్షించినను, తమ తలి దండ్రులు వారిని ప్రేమించు చున్నారని యే వారెరుగుదురు. ప్రభువు మనలను శిక్షించునప్పుడు ఈ సత్యమును మనము కూడ నేర్చుకొనవలసి యున్నది. "నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము, ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుగకుము. ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" (హెబ్రీ 12:6).

బిడ్డలు నమ్రత, విధేయత కలిగినవారు. వారి యొక్క యోగ క్షేమములు తమ చేతిలోగాక, మరింకొకరి చేతిలో యున్నవని వారెరుగుదురు. అందువలన తమ్మును తాము తగ్గించు కొందురు. అందుకే "ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొను వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు" అని యేసు బోధించెను (మత్తయి 18:4). క్రైస్తవులు తమ ఆత్మల రక్షణ కర్తయైన క్రీస్తు కొరకు తమ్మును తాము తగ్గించుకొని బిడ్డలవంటి వారు కావలెను. "ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? తన సొంత కుమారుని అను గ్రహించుటకు వెనుతీయక మన అందరి కొరకు ఆయనను

అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?" (రోమా 8:31, 32). అవును, "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరము తీర్చును" అని పరిశుద్ధాత్ముడు పలికెను (ఫిలిప్పీ 4:19).

తమ తలిదండ్రులు వారి యెడల చూపుచున్న ప్రేమను బట్టి వారు చాల ప్రాముఖ్యమైన వారని బిడ్డలు నమ్ముదురు. అట్లే క్రైస్తవులు కూడ చాల ప్రాముఖ్యమైనవారు. వారు దేవుని బిడ్డలు. రారాజైన దేవుని బిడ్డలు. "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు... మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతోకూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము, క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:14-17).

**బిడ్డలు నేర్చుకొనుటకు బోధింపబడుటకు ఎంతో ఆసక్తిని చూపింతురు.** అట్టి యాసక్తిని మనము కూడ కలిగి యుండవలెనని ప్రభువు కోరుచున్నారు. ఆయన ఇట్లనుచున్నారు : "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును" (మత్తయి 11:28,29). ప్రభువు పాదముల యొద్ద కూర్చుని నేర్చుకొనుటకు బిడ్డలవంటి ఆసక్తి, అతురత మనము కలిగి యుండవలెను. "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తి పరచబడుదురు" (మత్తయి 5:6).

**బిడ్డలు అందరి యెడల నిష్కపటమైన ప్రేమను కలిగి యుందురు.** అట్లే మనము కూడాను, అందరి యెడల ప్రేమను కలిగి యుండవలెను.

మన పూర్ణ మనస్సుతోను, పూర్ణ ఆత్మతోను మొదట దేవుని మనము ప్రేమింపవలెను. అటు తరువాత మనలో ప్రతివాడును తనవలె తన పొరుగు వానిని ప్రేమింపవలెను అని క్రీస్తు బోధించెను (మత్తయి 22: 35-40). “మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమించవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురు'' అని ఆయన బోధించెను. మీ ప్రేమ నిష్కపటమైనదై యుండ వలెను. సహోదర ప్రేమ విషయములో ఒకని యందొకడు అనురాగము గలవారై యుండవలెనని పౌలు హెచ్చరించెను (రోమా 12:9).

బిడ్డలు అమాయకులు, పవిత్రులు. మనము కూడ అట్లే యుండవలెను. అందుకే “మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పు చున్నానని” క్రీస్తువారు పలికెను. నీవు ఎట్లున్నావు? నీ మనస్తత్వము యెట్టిది? అనేక పాపములను బట్టి నీవు గర్వాంధుడవై యున్నావేమో. అయితే మార్పునొందు, నిన్ను నీవు తగ్గించుకో. నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ హృదయముతోను యేసుక్రీస్తును ఆశ్రయించు. ఆయనే నీ రక్షకుడని, దేవుని ఏకైక కుమారుడని విశ్వసించుము. నీ పాపముల నుండి మార్పునొందుము. నీవు మారుమనస్సు నొందని యెడల నీ పాపములలోనే నశింతువు అని దేవుని వాక్యము చెప్పుచున్నది గనుక మార్పు నొందుము. ప్రభువు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాప క్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడుము పొందుము. ప్రభువు నీ గత పాపములన్నిటిని కడిగి పసిబిడ్డ వంటి ఒక నూతన జీవితమును, నూతన స్వభావమును నీకు అనుగ్రహించును.

# ఎవడును అతిశయింపకుండునట్లు

## (That No one shou'd Boast)

క్రియల ద్వారా రక్షణకును, కృప ద్వారా రక్షణకును గొప్ప వ్యత్యాస మున్నది. "నేనేమి చేసానో చూడు! అను దాని కిని "దేవుడు నాకేమి చేసాడో చూడు' అను దానికిని మధ్య యున్న తేడా అది.

మనము విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నాము. మన విశ్వాసము యొక్క యదార్థతను తెలియజేయు క్రియలున్నవి (యాకోబు 2:21-24). గాని మన క్రియలు పాపమును తీసివేయలేవు, క్రియల ద్వారా రక్షణను సంపాదించుకోలేము. అట్లయితే మనం మన క్రియలను గూర్చియే అతిశయపడుదుము.

"మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలు లేదు" అని అపొ.పౌలు చెప్పాడు (ఎఫె 2:8,9). "అబ్రాహాము క్రియల మూలముగా నీతిమంతుడని తీర్చ బడిన యెడల అతనికి అతిశయ కారణము కలుగును గాని అది దేవుని యెదుట కలుగదు" (రోమా 4:2).

నేను దేని యందును అతిశయ పడను, యీవులు కాదు, శక్తి కాదు, జ్ఞానముకాదు గాని క్రీస్తు నందే అతిశయ పడుదును. ఆయన మరణ పునరుత్థానముల యందు అతిశయ పడుదును. ఒకటి మాత్రము నేనెరుగుదును, ఆయన గాయములు నా విమోచన క్రయధనమును పూర్తిగా చెల్లించెను. "అయితే మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువ యందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక; దాని వలన నాకు లోకమును, లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము" (గలతీ 6:14).

– సీసెలోమే

# పరిశుద్ధ దేవుని ఆరాధన

## ( Worship of the Holy God )

"అహరోను కుమారులైన నాదాబు అబీహులు తమ తమ ధూపార్తులు తీసికొని వాటిలో నిప్పు లుంచి వాటిమీద ధూప ద్రవ్యముంచి యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలు దేరి వారిని కాల్చివేసెను, వారు యెహోవా సన్నిధిని మృతి బొందిరి" (లేవీ 10:1-2).

ఇశ్రాయేలీయులు సీనాయి కొండ దగ్గర బస చేసినప్పుడు ఈ సంఘటన సంభవించెను. దాని నుండి మనం అనేక సంగతులను నేర్చుకొన వచ్చును. మన దేవుని యొక్క తత్త్వము, వ్యక్తిత్వము, ఆయన స్వభావములను అది మనకు బోధించుచున్నవి. దేవుడు మనము కూడ పరిశుద్ధులుగా యుండుటను గూర్చి మనం నేర్చుకొన వచ్చును. నిజానికి నేడు కూడ లేవీయ కాండము నేటికిని మనకు చాల ప్రయోజనకరముగా యున్నది. పేతురు ఇట్లు చెప్పుచున్నాడు :

"కాబట్టి మీ మనస్సు అను నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధి గలవారై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగి యుండుడి. నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై మీ పూర్వపు అజ్ఞాన దశలో మీకుండిన ఆశలననుసరించి ప్రవర్తింపక మిమ్మును పిలిచిన వాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తన యందును పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:13-16).

లేవీ 1:45ను ఎత్తి చూపిస్తు పేతురు క్రైస్తవులను క్రైస్తవ జీవితము జీవించాలని హెచ్చరించాడు (లేవీ 19: 2, 20:7,26) నిజానికి పరిశుద్ధత అను అంశాన్ని అతడు ప్రత్యేకంగా

ఎత్తిచూపాడు. అది లేవీకాండము యొక్క ముఖ్యాంశము. లేవీయుల ఆరాధన విషయంలో తగు జాగ్రత్తలను గూర్చి వక్కాణించిన గ్రంథము అది. అది లేవీ యాజకులకు ఒక అచ్చు పుస్తకము వంటిది. అయినను ఆ గ్రంథము యొక్క ప్రధమాంశము పరిశుద్ధత, అది కాలముతో నిమిత్తము లేనిది. దేవుడు పరిశుద్ధుడు. ఆయనతో సహవాసము కలిగి యుండగోరువాడు (లేవీ 1-16), ఆయనతోనే యుండ గోరువాడు (లేవీ 17-27) పరిశుద్ధుడై యుండాలి, అనగా దేవుని కొరకు ప్రత్యేకించుకోవాలి, ప్రతిష్టించుకోవాలి.

ప్రత్యేకత :

పరిశుద్ధుడుగా యుండుట అనగా నేమి? అనగా ప్రత్యేకింపబడుట, ప్రత్యేకముగా యుండుట పరిశుద్ధుడుగా యుండుట యనగా దైవిక నిర్ణయము చొప్పున ప్రత్యేకింపబడి, ప్రత్యేకముగా నడుచుకొనుట, ప్రత్యేక మాదిరిననుసరించుట పరిశుద్ధ దేవునితో పరిశుద్ధ సంబంధము కలిగి యుండుటలో ఆయన నిర్ణయాలకు కట్టుబడియుండుట. పరిశుద్ధునిగా యుండుట అనగా దేవుడు కోరు రీతిగా చేయుటకు ఆసక్తి కలిగి యుండుట, దేవుని ఉనికిని ఆయన సన్నిధిని నిత్యము ఎరిగినవారమై మన జీవితం అనుక్షణం ఆయన సన్నిధిలో యున్నామని జీవించుటయే పరిశుద్ధత. మనం తప్పుచేసినప్పుడు క్షమాపణ మనకు లభించును. (లేవీకాండములో 80 మార్లకు పైగా రక్తము వాడబడినది). అయినను దేవుని కిష్టానుసారముగా జీవించుటే మన జీవిత గమ్యము. ఆయనను సంతోష పరచాలి, ఘనపరచాలి. ఆయనను పరిశుద్ధునిగా చూపించాలి, మనకు మనమే పరిశుద్ధముగా జీవించాలి, ఆయన చిత్తానుసారముగా నడవాలి.

నాదాబు అబీహులు :

లేవీయకాండము పదియవ అధ్యాయములో అహరోను యొక్క నలుగురు కుమారులలో ఇద్దరికి దేవునికి దూపార్పణ ఎట్లు చేయాలో

దాని మాదిరి వారి కియ్యబడినది. ఈ మాదిరిలో సరియైన వ్యక్తులు, సరియైన స్థలములో, సరియైన సమయములో, సరియైన ధూపార్తులను, సరియైన ధూపద్రవ్యములను, సరియైన అగ్నిని ఎట్లు వినియోగించాలో తెలియ జేయ బడినది (లేవీ 10:1,2).

అయితే దైవమాదిరి నుండి స్వల్పముగానే తొలగినట్లగుబడు రీతిగా ఈ యిద్దరు మనుష్యులు కాని అగ్నిని, యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని వినియోగించారు. అది అపరిశు ద్ధము, కాని అగ్ని, అజ్ఞాపింపని అగ్ని. ఇంకొకమాటలో వారు దేవుడు ఆజ్ఞాపింపని వేరొక చోట నుండి అగ్ని ని తీసికొని వచ్చారు. వారు సరియైన ధూపద్రవ్యములనే తెచ్చినను, యెహోవా ఆజ్ఞాపింపని వేరొక అగ్నిని తమ ధూపార్తులలో యుంచారు (నిర్గమ 30:9). బహుశా వారిద్దరు మద్యపాన ము చేసియుండవచ్చును (లేవీ 10:9). అయితే ముఖ్యముగా వారు దేవుడు వారి కాజ్ఞాపింపని వేరొక అగ్నిని తెచ్చు టయే ముఖ్యముగా వారి దోష మాయెను (సంఖ్యా 3:4, 26:61). అందు వలన వారు స్వేచ్ఛారాధన చేసి అపరాధులయ్యారు. దేవుడు చెప్పినది కాక తమ యిష్టానుసారముగా ప్రవర్తించారు, చంపబడ్డారు.

వారి శవములు ఇంకా కాలుచు యుండగానే మోషే తన సహోదరుడైన అహరోనుతో ఇట్లనెను : “ఇది యెహోవా చెప్పిన మాట - నా యొద్దనుండు వారి యందు నేనునన్ను పరిశుద్ధపరచుకొందును, ప్రజలందరి యెదుట నన్ను మహిమ పరచు కొందును” (లేవీ 10:3)

యివి చాల శక్తివంతమైన మాటలు. దేవుని హెచ్చరికలను గైకొనకపోతే దేవునికి మానవునికి మధ్య అగాధములేర్పడును. ఒకడు దైవిక మాదిరి నుండి తప్పిపోయిన యెడల, అతడు లేక ఆమె దేవుడు పరిశుద్ధుడని తెలియజేయుటలో విఫలమగును. యిది ఆశ్చర్యము! మన దుష్ప్రవర్తన వలన దేవుని కళంకితుని గా చేయుదుము!

భక్తిపరులమని చెప్పుకొను ప్రజలు, దేవునిని, క్రీస్తును ప్రేమించు చున్నామని చెప్పుకొనువారు తమ స్వేచ్ఛానుసారమైన ఆరాధన పద్ధతులను అనుసరించునపుడు, దైవ వ్యతిరేకులగుదురు. దేవుడు ప్రత్యేకుడని, పరిశుద్ధుడని తెలియ జేయుటలో విఫలులగుదురు.

రెండవదిగా, దేవుని ఆరాధన షరతులను ఒకడు తన యిష్టాను సారముగా మార్చినపుడు అతడు దేవుని మహిమ పరచలేడు. మహిమ అనగా గౌరవించుట, ఘనపరచుట యని అర్థము, దేవునికి అవఘనత తెచ్చునట్లు ఎవరు ప్రవర్తింప గోరుదురు? అయినను ప్రజలు తమ యిష్టానుసారముగా మానవ కల్పిత పద్ధతులతో దేవుని నారాధించునప్పుడు వారు దేవునిని కాదు గాని తమ్మును తామే సంతోష పెట్టగోరుదురు, శాప గ్రస్థులగుదురు.

- డేవ్ మిల్లర్

# గొప్ప విలువ గల ముత్యము

## (The Peal of Great Price)

పరలోకరాజ్యము మంచి ముత్యములను కొనవెదకుచున్న వర్తకుని పోలియున్నదని యేసు చెప్పారు (మత్తయి 13:45). ఆ రాజ్యమే క్రీస్తు సంఘము. గనుక సరియైన సంఘమును కనుగొనుట గొప్ప సంపదను కనుగొనుటతో సమానము. అది పరలోక సంపద, నిత్య సంపద, దిగువ లక్షణముల ద్వారా దానిని నీవు గుర్తించగలవు :

క్రొత్త నిబంధన సంఘము క్రీస్తుచే నిర్మింపబడెను, అది ఆయనకే చెందును : "నా సంఘమును నేను కట్టుదునని యేసు వాగ్దానము చేసారు (మత్తయి 16:18). క్రీస్తే సంఘమునకు మూలరాయియు, దాని పునాదియు అయ్యున్నారు (1 కొరింధి 3:11, ఎఫెసీ 3:11; 2:19–22). ఆయన పేరును సంఘము ధరించుకొనది.

క్రొత్త నిబంధన సంఘము నిర్ధిష్టపైన ఆరాధన కలిగియున్నది : (యోహాను 4:24). వారు ప్రతి ఆది వారమున కూడుకొందురు (అపొ.కా. 20:7; 2:1; 1కొరింధి 16:1,2; మత్తయి 28:1, మార్కు 16:1,2; యోహాను 20:1,2, 19, 26).

ప్రతి ఆదివారమున వారు ప్రభురాత్రి భోజనములో పాలు పొందు దురు (అపొ.కా. 2:42; 20:7; 1 కొరింధి 11:23-25)

క్రొత్త నిబంధన సంఘము ప్రార్ధనలో ఆరాధింతురు (అపొ.కా. 2:42).

క్రొత్త నిబంధన సంఘము దేవునికి స్తుతిగీతములు (వాద్యములు లేకుండా) పాడుదురు (ఎఫెసీ 5:19; కొలస్స 3:16).

క్రొత్త నిబంధన సంఘము వాక్యోపదేశము గావించుకొనుటలో బలపడును (అపొ.కా. 20:7; 2 తిమో 4:2-4).

క్రొత్త నిబంధన సంఘము ప్రతి ఆదివారమున కానుకలు నిత్తురు (1 కొరింధి 16: 1-2).

క్రొత్త నిబంధన సంఘమునకు నిర్ధిష్టమైన అర్గనైజేషన్ కలదు : యేసు క్రీస్తే దాని శిరస్సు (ఎఫెసీ 1:22,23; కొలస్స 1:18).

ప్రతి స్థానిక సంఘము దాని పనిని పర్యవేక్షించు పెద్దలను కలిగి యుందురు (అపొ.కా. 14:23; 1 పేతురు 5:1,2; ఫిలిప్పీ 1:1). వారిని అధ్యక్షులను, కాపరుని కూడ పిలుతురు (ఎఫెసీ 4:11; 1 పేతురు 5:1-4). పెద్దలు ప్రత్యేక అర్హతలు కలిగిన వారై యుండవలెను (1 తిమోతి 3:1-7; తీతు 1:5-9).

పరిచారకులు సంఘములో పరిచర్య చేయుదురు (ఫిలిప్పీ 1:1; 1 తిమోతి 3:8-13).

బోధకులు వాక్యపరిచర్య చేయుదురు, వారు సువార్త సేవకులు (అపొ.కా. 21:8; ఎఫెసీ 4:11; 2 తిమోతి 4:1-5).

# దేవుని ఆశ్రయ పురము

## ( God's City of Refuge)

వివిధ కాలములలో వివిధ సంస్కృతులలో ఆశ్రయ స్థానములను పయోగించేవారు. యివి హంతకులకు పట్టుబడిన వారికి ఉపయోగించబడేవి.

ఆశ్రయపురమును గూర్చిన అభిప్రాయము మానవ సంస్కృతులన్నిటికీ ముందు నుండే యుండెను. యిది మనకు పాత నిబంధనలో కనబడును. అది దేవుని మనస్సు నుండి ఉద్భవించెను. కొన్ని పరిస్థితులలో దేవుని ప్రజలు ఈ ఆశ్రయ స్థానములను కలిగి యుండిరి. ఆరంభములో దేవుడు ఇశ్రాయేలీయులకు ఇట్లు చెప్పారు : "నరుని చావ గొట్టిన వానికి నిశ్చయముగా మరణ శిక్ష విధించవలెను. అయితే వాడు చంపవలెనని పొంచి యుండకయే దైవికముగా వానిచేత ఆ హత్య జరిగిన యెడల వాడు పారిపోగల యొక స్థలమును నీకు నిర్ణయించెదను" (నిర్గమ 21:13,14). దేవుడు వారికి ఆశ్రయ మిచ్చుటయే గాక, వారి క్షేమమును గూర్చి కూడ ఆలోచించారు. సంఖ్యాకాండము 35:6-28లో ఆ స్థలము ఒక ఆశ్రయ పురముగా నుండుటకు ఉద్దేశించబడినది. ద్వితీయోపదేశకాండము 4:41-43లో యొర్దాను ఇవతల మూడు పురములు ఇందునిమిత్తమై వేరుపరచబడెను.

ద్వితీయోపదేశకాండము 19-21 అధ్యాయాలలో ప్రజల సంరక్షణార్థము ఏర్పాటు చేయబడిన శాసనములున్నవి. తద్వారా మానవ ప్రాణము యొక్క విలువను గూర్చి తెలియ జేయబడెను. ద్వితీయోపదేశకాండము 19వ అధ్యాయములో యొర్దానుకు ఆవల మరి మూడు ఆశ్రయ పురములను నియమించుటకుగాను హెచ్చరికలు ఇయ్యబడెను.

మోషే యిచ్చిన ఆజ్ఞలకు యెహోషువా ఎట్లు విధేయుడయ్యాడో యెహోషువ 20:1-9లో రికార్డు చేయబడినది. ఇశ్రాయేలీయులు కానాను దేశమును స్వాధీనము చేసికొనిన మొదట్లోనే ఈ పురములను

గూర్చిన ఆజ్ఞలను జారీచేసాడు (యెహోషువ 20:2). ఆ పని జరిగించుటకది శ్రేష్ఠమైన సమయం ఏలయనగా ఆదేశము పర్యవేక్షింపబడెను మరియు వారు దానిని తేలికగా మూడు భాగములు చేయగల్గిరి.

## నైతిక పూర్వోత్తరము

ఆశ్రయపురములను గ్రహించుకొనక ముందు ఒకని ప్రాణము నిచ్చుటకు, తీసికొనుటకును దేవుని దృక్పథమును మొదట మనము గ్రహించవలెను. మానవుడు దేవుని స్వరూపమందు చేయబడెను (ఆది.కా. 1:26, 27). దేవుడు తన జీవపు ఊపిరి నూదగా మానవుడొక సజీవుడైన ఆత్మయాయెను (ఆది.కా. 2:7). గనుక ప్రాణము, దేవుని వరము. దాని నొకమారు తీసికొనిన యెడల మానవునికి ఎవరు ప్రాణము తిరిగి పోయలేరు. ఎవడైనను ఒక మనుష్యుని చంపిన యెడల అది నరహత్య, లేక నరవధ యగును. గతంలో యున్న పగను బట్టి ఒకని చంపిన యెడల అది హత్య యగును (సంఖ్యా 35:20, 35:21). ఈర్ష్య, ద్వేషము, ఉద్రేకము వలన చంపిన యెడల అది హత్యయే యగును (మత్తయి 5:21,22). చంపిన వాడు ఇనుప వస్తువుగాని, కర్రను గాని, రాయిని గాని విని యోగించి యుండవచ్చును (సంఖ్యా 35:16; 35:18; 35:17,20).

మానవుడు గొప్ప అభివృద్ధి సాధించినను, ఈ భూగోళము నుండి నరహత్యను నిర్మూలించలేకపోయాడు. నిజానికి పూర్వపు దినముల కంటే ఈనాడు మానవ ప్రాణము స్వల్పమైపోయింది. అమెరికాలో ప్రతి సంవత్సరము రెండు లక్షలకు పైగా హత్యలు జరుగుచున్నవి. భారత దేశములో దానికి రెండు మూడు రెట్లు ఎక్కువే జరుగుచున్నవి.

నరహత్యను గూర్చి పాత నిబంధనలో చాల కఠిన శాసన మున్నది. "ఒకడు చచ్చునట్లు వానిని ఇనుప ఆయుధముతో కొట్టువాడు నరహంతుకుడు. ఆ నరహంతకునికి నిశ్చయముగా మరణ శిక్ష విధింపవలెను. ఒకడు చచ్చునట్లు మరి

యొకడు రాతితో వాని కొట్టగా దెబ్బ తినినవాడు చనిపోయిన యెడల కొట్టిన వాడు నరహంతకుడగును. ఆ నరహంతకుడు నిశ్చయముగా మరణ శిక్ష నొందును. మరియు ఒకడు చచ్చునట్లు మరియొకడు చేతికఱ్ఱతో కొట్టగా దెబ్బతినినవాడు చనిపోయిన యెడల కొట్టిన వాడు నరహంతకుడగును. ఆ నరహంతకుడు నిశ్చయముగా మరణశిక్షనొందును" (సంఖ్యా 35: 16-18). నోవహు ఓడ నుండి వెలుపలికి వచ్చిన తరువాత దేవుడు "నరుని రక్తమును చిందించు వాని రక్తము నరుని వలననే చిందింపబడును, ఏలయనగా దేవుడు తన స్వరూపమందు నరుని చేసెను" అని చెప్పెను (ఆది.కా.9:6). రక్తమును చిందించువాని చేతులు అపవిత్రములు (ద్వితీ 21:7; సామె 6:17). రక్తము చిందింపబడిన నేల శపించబడినది (ఆది.కా.4:10; సంఖ్యా 35:33; కీర్తన 106:38)

నరహత్య దేవునికి ఎంత హేయమైనదంటే ఆకార్యమును చేసిన వాని రక్తమే దాని యొక్క పరిహారమాయెను. అపరాధము జరిగినప్పుడు దాని పరిహారము చెల్లింపబడవలెను. హత్యగావింపబడిన ప్రాణమును హంతకుడు తిరిగి తేలేడు గనుక అతడు తన ప్రాణమునే అర్పించవలెను.

ఒకడు ప్రమాదవాశాత్తు మరొకని చంపిన యెడల మోషే ధర్మశాస్త్ర ప్రకారము అట్టివాడు కూడ చంపబడవలెను. అతడేమి జరిగించాడో అదే అతనికి కూడ జరిగింపవలెను. నిర్గమ 21:12-25 చూడుము. అయితే దేవుడు ఒకని హృదయమును దాని తలంపులను చూచును (1 సమూ 16: 7; మత్తయి 5:21,22; 15:18-20; సామె 4:23 చూడుము).

**మోషే యిచ్చిన ఉదాహరణ :**

చెట్లను నరుకు యిద్దరు మనుష్యుల ఉదాహరణను మోషే తెలియజేసాడు. "ఒకడు చెట్లు నరుకుటకు తన పొరుగు వానితో కూడ అడవికిపోయి చెట్లు నరుకుటకు తన చేతితో గొడ్డలి దెబ్బ వేసినప్పుడు గొడ్డలి పిడి ఊడి వాని పొరుగువానికి తగిలి వాడు

చనిపోయిన యెడల వాడు అంతకు ముందు తన పొరుగు వాని యందు పగపట్టలేదు గనుక వానికి మరణ దండన విధిలేదు. అయితే హత్య విషయములో ప్రతి హత్య చేయు వాని మనస్సు కోపముతో మండుచుండగా, మార్గము దూరమైనందున వాడు నర హంతకుని తరిమి వాని కలిసికొని చావ గొట్టక యుండునట్లు ఆ నర హంతకుడు పారిపోయి ఆ పురములలో ఒక దాని యందు జొచ్చి బ్రదుకును" (ద్వితీ 19:5,6).

ఇశ్రాయేలీయులు అరణ్యయాత్ర లో యున్నపుడు ఆ నరహంతకుడు బలి పీఠపు కొమ్ములనాశ్రయించ వచ్చును (నిర్గమ 21:13,14). గాని వారు కానానులో స్థిరపడిన తరువాత బలి పీఠము నుండి దూరముగా వారు నివసింతురు గనుక దేవుడు వారికి ఆరు ఆశ్రయ పురములను ప్రత్యేకించెను.

మోషే ఇచ్చిన ప్రత్యేక హెచ్చరికల వలన ఈ పురములను నేరస్థులు తమ స్వలాభము కొరకు వినియోగింప వీలు లేకుండెను.

ఆశ్రయ పురములు లేవీయుల పురములు గనుక వాటిలో ఆశ్రయము నొందినవారు ప్రధాన యాజకుని బందీలుగా పరిగణింపబడుదురు. ప్రధాన యాజకుని మరణము వానికి స్వాతంత్ర్యము కలిగించును.

## నేడు మనము నేర్చుకొన దగినవి

మనకు బోధకలుగు నిమిత్తము పాత నిబంధన వ్రాయబడినందు వలనను (రోమా 15:4), రాబోవు మేలులకు ఛాయ వలె యుండినందు నను (హెబ్రీ 10:1) ఈ ఆశ్రయ పురముల నుండి యేమి నేర్చుకొన గలము? మోషే ధర్మశాస్త్రములో వాటిని గూర్చి మనం చదువుదుము. అయినను పాత నిబంధన వ్యక్తులు దానిలో ఆశ్రయము పొందినట్లు మనకు కనబడదు. వాటిలో కొందరు ఆశ్రయము పొంది యుండేయుందురు, అయినను వారిని గూర్చి చెప్పబడలేదు.

ఆశ్రయపురములు ఆశ్రయ మిచ్చునవి. నిజానికి పాపులకు సువార్త

సంఘములో ఆశ్రయమిచ్చుచున్నది. మనలో ప్రతివాడు పిడి ఊడిపోయి తన మిత్రుని చంపిన పరిస్థితిలో యున్నా ము. ఈ లోకమంతయు యేసు క్రీస్తును చంపిన అపరాధములో యున్నాము (హెబ్రీ 6:6). మనము పరోక్షముగను, అజ్ఞానము వలనను దానిని జరి గించాము (అపో.కా. 3:17, 18; 1 కొరింధి 2:6–8). హెబ్రీ 6:8లో "మన యెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు..." అను మాటలు నరహత్య చేసినవాడు శరణు కొరకు ఆశ్రయ పురమునకు జొచ్చుట సూచించు చున్నది. ప్రతి పాపియు ఒక విమోచకుని అవుసరాన్ని కలుగజేసాడు గనుక, ఈ లోకమునంతటిని నర హంతకులుగా దేవుడు పరగణించును. ఇంకొక మాటలో నీవు, నేను కూడ యేసు క్రీస్తు మరణమునకు బాధ్యులమే.

విచిత్రం యేమంటే మనము చంపిన క్రీస్తే మన విమోచకుడు. "మనుష్యకుమారుడు అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చెను" (మార్కు 10:45). " ఆ కుమారుని యందు మనకు విమోచనము అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" యని పౌలు వ్రాసాడు (కొలస్స 1:14; ఎఫెసీ 1:7; 2 తిమో 2:10; అపో.కా. 4:12).

క్రీస్తే మన ఆశ్రయ దుర్గము (యోహాను 14:6; 15:4,5). సిలువ పై ఆయన బలియగుటవలన పాపు లందరు విమోచింపబడి ఆశ్రయము పొందునట్లు మనకొక ఆశ్రయ పురము లభించినది (హెబ్రీ 6:17–19). " యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట బహుధైర్యము పుట్టించును. అట్టివారి పిల్లలకు ఆశ్రయ స్థానము కలదు" అని సొలొమోను చెప్పాడు (సామె 14:26). "దేవుడు మనకు ఆశ్రయమును, దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొన దగిన సహాయకుడు" అది కీర్తనకారుడు వ్రాసాడు (కీర్తన 46:1). "సైన్యముల కధిపతియగు యెహోవా మనకు తోడై యున్నాడు; యాకోబు యొక్క దేవుడు మనకు ఆశ్రయమై యున్నాడు" (కీర్తన 46:7,11). "ఆయనే నా కోట, నాకు

ఆశ్రయము, నేను నమ్ముకొను నా దేవుడని నేను యెహోవాను గూర్చి చెప్పుచున్నానని" దావీదు మరల పలికాడు (కీర్తన 91:2; సామె 18:10).

అనుకొనకుండా ఒక మనుష్యుని చంపినవాడు సకాలమునకు ఆశ్రయ పురము చేరుకొని ఎట్లు సురక్షితుడగునో, అట్లే క్రీస్తు నందున్నవాడు పాప మరణ ముల నుండి ఆశ్రయము నొందును (రోమా 8:1). గొర్రెపిల్ల రక్తము వలన విమోచింపబడినవారు సురక్షితులు, మిగతావారు కాదు (నిర్గమ 12:13). గనుక క్రీస్తు సంఘము పరిశుద్ధపరచ బడిన వారికొరకు ఆశ్రయస్థానమై యున్నది (అపో.కా.20:32; రోమా 15:16; 1కొరింధి 6:11; హెబ్రీ 10:14). దేవుని చేతులలో నుండి అపవాది మనలను తన వైపు ఆకర్షించు కొన జాలదు (యోహాను 10:29). నరహంతకుడు ప్రమాదవశాత్తు జరిగి పోయిందని ప్రతికారము తీసికొనే వానికి చెప్పలేడు. అదే రీతిగా పాపి యైనవాడు ప్రమాదవశాత్తు అను కోకుండా జరిగిపోయిందని చెప్ప లేడు (కీర్తన 19:12).

అనుకోకుండా సంభవించిన బలహీనత వలన కలుగు పాపము (హెబ్రీ 12:1; 2 పేతురు 2:20), దేవుడు లేడని చెప్పువాని పాపముతో సమానము కాదు. అయినను అట్టి పాపములను దేవుడు ఉపేక్షింపరు (హబక్కుకు 1:13). ప్రతిపాపమునకు తగిన ప్రతి ఫలమును దేవుని న్యాయము కోరుచున్నది (హెబ్రీ 2:2,3).

అదే సమయంలో ఈ పాపులను కూడ దేవుడు ఉపేక్షింప జాలరు (నెహెమ్యా 9:31, రోమా 2:4). గనుక పాపులు తమ పాపముల పర్యవసానము నుండి తప్పించుకొను మార్గమును ఆయన కల్పించియున్నారు. ఆశ్రయ పురములు, క్రీస్తు సంఘము కూడ పరమందున్న దేవుడు కనికరము చూపుటకు ఆతురపడువాడును, శిక్ష విధించుటకు తొందరపడని వాడునని తెలియజేయుచున్నవి. పౌలు సంఘమును హింసిచిన వాడు. అయినను అతడు కనికరింపబడ్డాడు.

ఏలయనగా అజ్ఞానము వలన అతడు క్రీస్తు సంఘమును హింసించాడు (1 తిమోతి 1:13,16). తన్ను సిలువ వేయుచున్న వారిని గూర్చి క్రీస్తు "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు గనుక వారిని క్షమించుమని" ప్రార్థించారు (లూకా 23:34).

ఆశ్రయ పురమును గూర్చిన తలంపు మోషేది కాదు. అది ఇశ్రాయేలీయుల పెద్దల తలంపు కూడ కాదు (సంఖ్యా 35:9-11). మానవులు దేవుని కటాక్షము కొరకు వేడుకొనగా అది కలిగినది కాదు. అది తనకవుసరమని మానవుడు తలంచకముందే దేవుడు దానిని కలుగజేసారు. అది పరమందున్న జాలి, కృప కనికరము గల అదృశ్య దేవుని యొక్క దృశ్య రీతిగా యున్న గొప్ప  ఋజువైయున్నది.

ఆశ్రయ స్థానమును గూర్చి నేడు కూడ అట్లే యున్నది. సంఘము క్రీస్తుచే నిర్మింపబడినది (మత్తయి 16:18). అది దైవ సంకల్పము వలన కలిగినది. (మత్తయి 28:18). ఆత్మతో నింపబడినది (1 కొరింథీ 3:17). అది క్రీస్తు అప్పటికప్పుడే తీసికొనిన నిర్ణయము వలన కలిగినది కాదు గాని జగత్పునాది వేయకబడక ముందు నుండే నిర్ణయించబడినది (ఎఫెసీ 3: 9,10).

పాపులు ఆశ్రయ పురమునకు పారిపోవుట వలన మాత్రమే మరణమును తప్పించుకొనగలరు. పురాతన ఇశ్రాయేలులో నరహంతకుడు తన ప్రాణ రక్షణ కొరకు తన గ్రామ పెద్దల యొద్దకు పోలేదు. తన ప్రాణ రక్షణార్థము సమాజమందిరములోనికి పోలేదు. గాని తనపై పగ తీర్చుకొనువాడు అతని పట్టుకొనక ముందే ఆశ్రయపురములోనికి చొచ్చిన యెడల మాత్రమే అతడు రక్షింపబడును.

మనకున్న నిరీక్షణ అంతా క్రీస్తులోను ఆయన సంఘములోను మాత్రమే యున్నది. మనమాయన యొద్దకు పారిపోయి ఆయనలో కనుగొనబడవలెను. (ఫిలిప్పీ 3:9). ఆయనలో మన పాప విమోచన, క్షమాపణ మనకు లభించును (కొలస్స 1:14). సహోదరుల మీద నేరము మోపు వాని

నుండి ఇక్కడ మనకు రక్షణ కలదు (ప్రక 12:10; యోబు 1:9, 2:4-5, జెకర్యా 3:1,2; లూకా 22:31).

డినామినేషన్లలోను, లోకసంబంధ మతములలోను మనకు రక్షణ కలుగదు. ప్రభుత్వము గాని, ధనము గాని, విద్య గాని మరింకేమైనగాని మనకు రక్షణ నివ్వదు. "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామము నే. మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరియేనామమున రక్షణ పొందలేము" (అపో.కా. 4:12). ఆత్మీయాశీర్వాదములన్నియు క్రీస్తులోను, ఆయన శరీరములోను అనగా ఆయన సంఘములో మాత్రమే యున్నవి (ఎఫెసీ 1:3, 22-33).

క్రీస్తు సంఘములో మనకు లభించు ఆత్మీయాశీర్వాదములు ఈ రీతిగా యున్నవి :

రక్షణ (2 తిమో 2:10; ఎఫెసీ 5:23)
విమోచన (కొలస్స 1:13,14; ఎఫెసీ 1:7)
క్షమాపణ (కొలస్స 1:13,14; ఎఫెసీ 1:7).
శిక్షలేదు (రోమా 8:1)
పరిశుద్ధత (1 కొరింధీ 1:2)
దేవుని వాగ్దానము లన్నియు (2 కొరింధీ 1:20; ఎఫెసీ 3:6).
సమాధానము (2 కొరింధీ 5:19; ఎఫెసీ 2:16).
నూతన సృష్టియగుట (2 కొరింధీ 5:17).
సర్వసంపదలు (కొలస్స 2:3,4)
ఆత్మీయ జీవితము (1 యోహాను 5:11,12)
పరిపూర్ణత (కొలస్స 2:10)

ఈ దీవెనలు లేకుండా ప్రజలు రక్షింపబడగలరా? రక్షింపబడలేరు. ఈ దీవెనలు లభించు చోటుకు ప్రతివారు చేరుకొనవలెను. అవి క్రీస్తులోను ఆయన సంఘములోను యున్నవి.

నీవు క్రైస్తవుడవు కావలెనంటే దేవుని వాక్యమును వినవలెను (రోమా 10:17). క్రీస్తునందు విశ్వాసముంచ వలెను (యెహాను 3:16) నీ పాపముల విషయము మారుమనస్సు పొందవలెను (లూకా 13:3). నీ విశ్వాసమును ఒప్పుకొని (మత్తయి 10:32) పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. క్రీస్తుసంఘమే నీ ఆశ్రయపురము!! ఈనాడే దానిలోనికి చేర్చబడుము.

-ఎలెన్ వెబ్‌స్టర్

# నిర్లక్ష్యము వలన అపాయము

## ( Danger of Negligence )

"ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము" అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై.. వినిన వారిచేత మనకు ధృడపరచ బడెను (హెబ్రీ 2:3). న్యాయ తీర్పు దినమున నరహంతకులు, వ్యభిచారులు, విగ్రహారాధికులు, త్రాగుబోతులు, అబద్ధికులు మొదలగు పాపులు, దేవుని చేత విసర్జించబడి అగ్నిగుండమునకు పోవుదురు. కాని క్రైస్తవులలో కూడా కొందరు "నిర్లక్ష్యము" వలన నిత్య నాశనమునకు వెళ్ళుట చాల విచార కరము.

అన్యజనులు విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మముల ద్వారా క్రీస్తుకు విధేయులగుటకు "నిర్లక్ష్యము" చేసిన ఎడల నిత్యనాశ నమునకు పోవుదురు (యోహాను 3:36; 2థెస్స 1:6-13). క్రైస్తవులు, ప్రభువు పనిని నిర్లక్ష్యము చేసి తమ విధి నిర్వహణ యందు తప్పిపోవుచున్నారు (ఎఫెసీ 2:10; ఫిలిప్పీ 2:12; యాకోబు 2:17-26). ప్రార్థించక పోవుట ద్వారా తప్పిపోవుచున్నారు (ఫిలిప్పీ 4:6, యాకోబు 5:16, లూకా 18:1). మత్తయి 6వ అధ్యాయము ప్రకారము చేయకపోవుట ద్వారా "ఇచ్చుట" నిర్లక్ష్యము చేయుట వలన తమ స్వంత రక్షణను పోగొట్టుకొను చున్నారు (2 కొరింధి 8వ అ.పా. 8:1-10). అక్కరలోను, ఆపదలోను వున్న సహోదరులను నిర్లక్ష్యముచేయుట నిర్లక్ష్యము చేయుచున్నారు. (మత్తయి 25:31-46). క్రైస్తవులు తమ విధులను ఎల్లప్పుడు జ్ఞాపకము చేసికొనుచుండవలెను (2 పేతురు 1:12-14).

అందువలన ప్రియ సహోదరులారా, మీ పిలుపును, ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి (2 పేతురు 1:5-10).

బి. ఆనందరావు
క్రీస్తు సంఘము - గుడిపూడి

# సంక్షిప్త వార్తలు

2019 జూన్ 1,2,3 తేదీలలో అమలాపురం కరక్కాయపేటలోని క్రీస్తు సంఘము తమ వార్షిక సువార్త మహాసభలు నిర్వహించిరి. సోదరులు జాషువా గూటం, మేడిది జాన్సన్ మరియు పి.యస్.ఆర్. జయపాల్ గార్లు వాక్యోపదేశము చేసిరి. విప్పర్తి రాజ్‌కుమార్ మరియు విప్పర్తి బాబీ గార్ల సోదర ద్వయం చక్కటి హెచ్చరికలనిస్తు, పాటలు, ప్రార్ధనలు నిర్వహిస్తూ ఈ సువార్త సభలను ఘనముగా నిర్వహించిరి. హాజరైనవారందరికీ స్థానిక సంఘము ప్రతిరాత్రి భోజన సౌకర్యము కల్పించిరి. వందలాది మంది హాజరై సమృద్ధియైన ఆత్మీయాహారమును, నిజ క్రైస్తవ సహవాస మాధుర్యమును చవిచూచి ప్రభువును స్తుతించిరి.

2019 జూన్ 5,6,7 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా క్రీస్తు సంఘములు సమిష్టిగా నిర్వహించు యేసుక్రీస్తు రక్షణ సువార్తసభలు, గత నాలుగు సంవత్సరములలో వలెనే కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఘనముగా నిర్వహించబడెను. 2019 ఏప్రియల్, మే నెలలలో జరిగిన భారతదేశ సార్వత్రిక ఎన్నికల వలన ఈ సంవత్సరము జూన్ మొదటి వారములో జరిగించబడినవి. వాతావరణ విషయమై కొంత సందేహమున్నా దేవుని కృప వలన సభలు ఘనముగా నిరాటంకముగా నిర్వహించబడెను.

సోదరులు వి. చిన్నయ్య (కడలి), వి. రాజు (చెన్నై), ఆర్.సి.హెచ్. సద్గుణరావు (శ్రీకాకుళం), కె.బి.బి. చంద్రపాల్ (విజయవాడ), పి.ప్రవీణ్ (ర్యాలి), యస్. జాన్ ఆనంద్ (తుని) గార్లు ముఖ్యప్రసంగీకులై వాక్యోపదేశము గావించిరి. మొదటి శతాబ్ధపు క్రైస్తవ్యము అనే అంశమును పలు కోణాల్లో సహోదరులు విశ్లేషించిరి. ఈ సభలకు పలు పట్టణ, పల్లెల ప్రాంతముల నుండి వేలాది ప్రజలు హజరైరి. ప్రతిరాత్రి ఆహ్లాదకరమైన వాతావరణం, ఆత్మీయ వాక్యం, సమయాన్ని పాటించడం వగయిరాలన్నీ అదే స్థలములో తరుచు జరుగు మతశాఖల సభలకు క్రీస్తుసంఘానికీ యున్న వ్యత్యాసమును గంభీరముగా నిశ్శబ్ధముగా తేట తెల్ల బరచబడెను. సభల నిర్వహణ కొరకు నిర్విరామకృషి సల్పిన సోదరులు యస్. ప్రభాకర్, పి. బలరామ్, యి. అబ్రహామ్‌లింకన్ మరియు కె.మోజెస్ కుమార్ గార్లు అభినందనీయులు.

2019 జూన్ 15 నుండి 21వ తేదీవరకు సోదరులు రోజర్‌రైటర్ గారు సతీసమేతముగా కాకినాడలో జాషువా గారితో యుంటూ వట్రుపూడి, ద్వారపూడి,

శ్రీకాకుళం, పెద్దాపురం తదితర గ్రామములు దర్శించి వాక్యపరిచర్య చేసిరి.

2019 జూన్ 27వ తేదీ సాయంత్రం కాకినాడ, శాంతినగర్‌లో పోస్టల్ కోలనీలో యున్న సోదరులు ఐ. చిదంబరరావ్ గారి యింటి ఆవరణములో జరిగిన కృతజ్ఞతాకూటములో సోదరులు జాషువా గూటం మరియు డి. నరేష్ కుమార్ గార్లు మరణం వెనుకయున్న ప్రమాదమును గూర్చి ప్రసంగించిరి. అనేకులు హాజరై చల్లటి వాతావరణములో, చక్కటి వాక్య సందేశం, మంచిసహవాసము, రుచి శుచిగల ఆహారమును ఆస్వాదించిరి. సోదరులు చిదంబరరావ్ గారు, కుటుంబసమేతముగా గొప్ప కృషిచేసిరి. హాజరైనవారందరు ఆయనన‌భినందించిరి.

2019 జూన్ 29వ తేదీ సాయంత్రమునకు రిక్కీ గూటం గారు కుటుంబ సమేతముగా అమెరికా నుండి కొచ్చిన్ మీదుగా కాకినాడ సురక్షితముగా చేరుకొనిరి.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-20**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.